క్లుప్తంగా

పొదుపు గ్రూపుల రుణ సాయం పెంపు

చీరాల టౌన్: వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సమాఖ్య పొదుపు గ్రూపులకు ప్రభుత్వం రుణ సాయాన్ని పెంపుదల చేసిందని ఏపీఎం సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పొదుపు గ్రూపులకు గతంలో రూ.10 లక్షల వరకే రుణ సదుపాయాన్ని అందిస్తున్నారు. అయితే రూ.10 లక్షల రుణం తీసుకునే గ్రూపులకు పూచీకత్తు లేకుండా బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20 లక్షల రుణాన్ని పొందవచ్చన్నారు. చీరాల మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల్లో రూ.10 లక్షల రుణం తీసుకునే గ్రూపులు 147 ఉన్నాయని ఈ గ్రూపులకు ఇక పైరూ.20 లక్షల రుణం అందుతుందన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ


భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో రవీందర్

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ గురువారం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో సుమారు 2800 మంది రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలు రాగా పంపిణీని పరిశీలించిన ఆర్డీవో స్వయంగా వీధుల వెంట తిరిగి రైతుల వేలి ముద్రలు వేయించి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్ఐ బాషా, వీఆర్వో శివనాగేశ్వర రావు ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చీరాల: పట్టణంలోని పాపరాజుతోటలో జరుగుతున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరిశీలించారు. భవనం నిర్మాణాన్ని పరిశీలించి భవన నిర్మాణ పురోగతిపై అధికారులతో చర్చించారు. పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈ కట్టా రవి తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: పర్యావరణానికి హానికరం చేసే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత పేర్కొన్నారు. చీరాల రూరల్ మండలంలోని ఈపూరుపాలెం, తోటవారిపాలెం, వాడరేవు గ్రామాలలో గురువారం 'నా మట్టి–నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మొక్కలు నాటాలన్నారు. అనంతరం పంచాయతీ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రెడ్డిబాబు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మునగాల గిరిధర్, ఉపాధ్యక్షుడు ఎ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామాల్లో పర్యటిస్తున్న బాపట్ల డీఎస్పీ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారిపైనైనా కఠినచర్యలు తీసుకుంటామని బాపట్ల డీఎస్పీ వెంకటేసులు హెచ్చరించారు. విలేజ్ విజిటింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం డీఎస్పీ మండలంలోని మిన్నెకల్లు, తంగేడుమల్లి, గురిజేపల్లి, కామేపల్లి, వెల్లలచెరువు, ఏల్చూరు, రామిరెడ్డిపాలెం గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపట్ల మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డీఎస్పీ వెంట సంతమాగులూరు సీఐ ప్రభాకరరావు, ఎస్సై శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

వీరుల ప్రాణత్యాగం వెలకట్టలేనిది

- వేడుకగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్
- నామట్టి–నాదేశంలో భాగస్వాములు కావాలి
- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య పిలుపు


బల్లికురవ: ఎస్సై వీ వేమనను సత్కరిస్తున్న కృష్ణచైతన్య


బల్లికురవ: కేజీబీవీలో జెండా ఆవిష్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య


పీ.గుడిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, చిన్నారులు

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం బల్లికురవ సమీపంలోని కేజీబీవీలో జరిగిన కార్యాక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నామట్టి–నా దేశం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వీరులకు సత్కారంలో భాగంగా ఎస్సై వీ. వేమన, ఎంపీడీవో సీహెచ్ కృష్ణలను ఆయన ఘనంగా సత్కరించారు. కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, పెదఅంబడిపూడి, గుంటుపల్లి, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, బల్లికురవ గ్రామాల్లో జరిగిన వేడుకల్లో తహసీల్దార్ కె. రవిబాబు, ఏపీఎం సురేంద్ర బాబు, పీఆర్ గృహనిర్మాణ సంస్థ ఏఈలు హనుమంతరావు, దుర్గారమేష్ వ్యవసాయాధికారి, ఎస్వీపి కమారి, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

➤ నా మట్టి– నా దేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖాధికారి భీమయ్య అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామ పంచాయతీలో శిలాఫలకం అంకితం, పంచ ప్రతిజ్ఞలు, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ కె. రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

➤ జే.పంగులూరు మండల పరిధిలోని బైటమంజులూరు, భగవాన్ రాజుపాలెం, జాగర్లమూడివారిపాలెం, కోటపాడు, ముప్పవరం, రామకూరు గ్రామాల్లో 'నా మట్టి–నా దేశం' కార్యక్రమం జరిగింది. రేణింగవరంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో రామాంజినేయలు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

➤ ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం, పీ.గుడిపాడు, యర్రబాలెం గ్రామాల్లో 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాలు గురువారం జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో సురేష్ బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్‌లు శ్రీలక్ష్మీకుమారి, బీ.నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలి..

ఇంకొల్లు (చినగంజాం)/కారంచేడు/మార్టూరు/యద్దనపూడి: ఆజాదీకా అమృతోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలని వక్తలు పేర్కొన్నారు. 'నా మట్టి–నాదేశం' కార్యక్రమంలో ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు, ఇంకొల్లు, వంకాయలపాడు, పూసపాడు గ్రామాల్లో శిలాఫలకాల ఆవిష్కరణ, అమరవీరులను స్మరించుకోవటం, జెండా వందనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌ఎం రాజ్యలక్ష్మి, ప్రత్యేకాధికారి రమేష్‌బాబు, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ ఎమీమా, డాక్టర్ అంజలి, సీహెచ్ఓ కోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

➤ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులను స్మరించుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. మండలంలోని యర్రంవారిపాలెం, ఆదిపూడి గ్రామాల్లో నిర్వహించిన 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సిబ్బందితో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, ఏపీఎం మధుసూదనరావు, ఏపీఎం ప్రదీప్, పీఆర్ జేఈ రామచంద్రుడు, గ్రామ సర్పంచ్ ఎస్ నాగరాజు, కారుమూడి సుబ్బారెడ్డి, దేవిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి

➤ ఆజాదీకా అమృతోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకుదురు, పల్లెపాలెం,చినగంజాం, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చినగంజాం–2 సచివాలయ పరిధిలో ఎంపీడీఓ కే స్వరూపరాణి, సర్పంచ్ ఆత్మారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా కొత్తపాలెం పంచాయతీలో జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మనందరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లెపాలెం, కడవకుదురు గ్రామాలలో ఎంపీడీఓ స్వరూపరాణి, తహసీల్దార్ పీ పార్వతిల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జీ శివకుమారి, సైకం మణిలు పాల్గొన్నారు.


రేణింగవరంలో 'నా మట్టి–నా భూమి' నిర్వహిస్తున్న అధికారులు


ఇంకొల్లు: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు


ఆదిపూడిలో నాదేశం–నామట్టి కార్యక్రమంలో అధికారులు, పాలకులు

నులిపురుగుల నివారణతో వ్యాధులు దూరం


విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న ఇంకొల్లు ఎంపీపీ అనూష


పేరాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఉపాధ్యాయులు


అద్దంకిలో మాత్రలు మింగిస్తున్న మండల పరిషత్ అధ్యక్షుడు

చినగంజాం/కారంచేడు: నులిపురుగుల నివారణతో వ్యాధులు దూరం అవుతాయని జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఏడాదికి రెండు పర్యాయాలు ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పక తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కే స్వరూపరాణి, పాఠశాల హెచ్‌ఎం డీ రత్నకుమారి, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మనందరెడ్డిలు చిన్నారులకు మాత్రలు మింగించారు. వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్, డాక్టర్ సాయిశ్రీ చరణ్ చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాన్సీరాణి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ హరిప్రసాద్, బేబీ, చిరంజీవి, ఉల్దా రాణి, హెల్త్ అసిస్టెంట్లు మురళి, సారమ్మ, సువార్త, ఆశ కార్యకర్తలు, విజయకుమారి, రోహిణి, అజంతా, 104 సిబ్బంది రాఘవ, ఎంఎస్ఓ సుబ్బారావులు పాల్గొన్నారు.

➤ సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సంతరావూరు ఎంపీయూపీ, ఆదివీధిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు కీర్తి సరోజ్, బీ నాగేంద్రలు నులిపురుగుల మాత్రలు మింగించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కేవీ సుబ్బారావు చౌదరి, ఏఎన్ఎం శాంత కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ కావ్య, ఎఫ్‌పీసీ సూపర్ వైజర్ జీ విజయప్రసన్న, ఆశలు పాల్గొన్నారు.

➤ నులిపురుగుల నివారణకు అవసరమైన ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలినీ అన్నారు. ఆమె జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వర్ణ హైస్కూల్‌లో ఆమె విద్యార్థులతో మాత్రలు మింగించారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వరకు ఉన్న 1160 మంది చిన్నారులకు మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, బయ్యా శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కారంచేడు యూపీలో ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పిల్లలతో మాత్రలు మింగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డీ ఉషారాణి, మేరి పాల్గొన్నారు.

➤ విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగేందుకు నులిపురుగులు నివారణ తప్పనిసరని ఇంకొల్లు ఎంపీపీ బండారు అనూష అన్నారు. ఇంకొల్లు గరల్స్ హైస్కూల్ నందు ఆమె నులిపురుగుల నివారణ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎమీమా, డాక్టర్ అంజలి, ఏ శ్రీనివాసరావు, పీవీ రాఘవరావు, ఎంఈఓలు, సీహెచ్ఓ కోటేశ్వరరావు, హెచ్‌ఎం నాగేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 వేల మందికి ఆల్‌బెండజోల్ పంపిణీ..

అద్దంకి రూరల్/బల్లికురవ: విద్యార్థుల చేత ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించటం వల్ల ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ కె. రవిబాబు, ఎంపీడీవో సీహెచ్‌కృష్ణ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలలు, కళాశాల, కేజీబీవీ, అంగన్వాడీ కేంద్రాల్లో 8 వేల మంది విద్యార్థులకు ట్యాబ్లెట్‌లు మింగించారు. వైద్యాధికారి రమీజ్ అహ్మద్, కెజీబీవి ప్రిన్సిపల్ కె. సరళకుమారి పాల్గొన్నారు.

➤ మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోదేపల్లి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా గురువారం 42 పాఠశాలలు, 38 అంగన్‌వాడీ కేంద్రాల్లో 5166 మంది విద్యార్థులకు గాను 4879 మందికి ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జయచంద్రరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, హెచ్ఈవో నాగేశ్వరరావు, ఏఎన్ఎం శివపార్వతి పాల్గొన్నారు.

➤ సంతమాగులూరు ఎంపీపీఎస్ కాలనీలో పాఠశాలలో ఎంపీపీ ఎనిబెర ఎలమంద ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. నులిపురుగులు నివారించటం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వీ. కోటేశ్వరరావు, హెచ్‌ఎం అనురాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల అర్బన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో వైద్య, ఆరోగ్య శాఖ రూపొందిన పోస్టర్లు, కరపత్రాలను మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా చీరాల ఏరియా వైద్యశాల వైద్యులు పాల్గొని నులిపురుగుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు 400 మంది విద్యార్థుల చేత మింగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్, కౌన్సిలర్ మల్లెల లలిత, వైద్యులు మనీష్, స్వాతి కిరణ్, ప్రణయ్, యాకుబ్, ఉపాధ్యాయులు భానుచంద్ర మూర్తి, వెలుగొండారెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలానే స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.సుధారాణి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల అర్చన

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి గురువారం లక్ష తమలపాకుల అర్చన చేశారు. ఉదయాన్నే గోపూజ, బండె తీర్థం, అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేకాలంకరణ, వేదపండితులు, అర్చకులు, దాతలు ఉభయదాతలు, వేదస్వస్తి, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తరువాత వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, రుత్విక్‌వరణం, ఉష్ణ వహన పూజ, జీవ ధ్వజానికి టెంకాయి సమర్పించారు. కార్యక్రమంలో ఉభయదాతలు మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పానకాల శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చీరాల: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ అయూబ్ హుస్సేన్, ఇన్‌చార్జి సయ్యద్ షమీమ్ బేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ లోపు పట్టణంలోని పేరాలలో గల పాత పోస్టాఫీస్ ఎదురు గల ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రంలో అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు, 40 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు నమోదు చేసుకోవాలన్నారు. ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ వారిచే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 92915 63511 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అధికారుల ఏకపక్ష ధోరణి విడనాడాలి


కమిషనర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ అమృతపాణి, ప్రజా సంఘాల నాయకులు

చీరాల రూరల్: అంబేడ్కర్ పాత విగ్రహం స్థానంలో కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజా సంఘాల నాయకులను కలుపుకోకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని వివిధ ప్రజా సంఘాల నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. తక్షణమే పనులను నిలుపుదలచేసి అందరి ఏకాభిప్రాయంతో పనులను ప్రారంభించాలని కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, ప్రజా సంఘాల నాయకులు గుమ్మడి ఏసురత్నం, దుడ్డు భాస్కరరావు, దామర్ల శ్రీకృష్ణ, ఊటుకూరి వెంకటేశ్వర్లు, చుండూరి వాసు, బత్తుల శామ్యూల్, గొర్రెపాటి రవికుమార్‌లు మాట్లాడారు. రైల్వే స్టేషన్ ఎదురు ముక్కోణం పార్కు సెంటర్లో సుమారుగా 50 ఏళ్ల క్రితం నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగించి పొక్లెయిన్‌తో తాడుతో వేలాడదీసుకుని అంబేడ్కర్ భవన్‌కు తీసుకెళ్లమేటిటని ప్రశ్నించి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పట్టణంలో ఓ విగ్రహం ఏర్పాటులో మున్సిపల్ అధికారులు ఆయా వర్గ నాయకులతో మూడుసార్లు చర్చలు జరిపిన అనంతరం విగ్రహం ఏర్పాటు చేశారని, అంబేడ్కర్ విగ్రహం విషయంలో ప్రజా సంఘాలు, దళిత నేతలు, అంబేడ్కరిస్టులతో ఎందుకు సమావేశాలు ఏర్పాటు చేయలేదో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అయితే మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తాను కొత్తగా వచ్చానని పనులను తాత్కాలికంగా నిలుపుదల చేయించి చర్చలు అంతరం అందరి ఏకాభిప్రాయంతో పనులు చేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌జె. జాన్ చిరంజీవి, దేవరపల్లి కుమార్‌బాబు, పేర్లి నాని, గోసాల అశోక్, దుడ్డు విజయ్‌సుందర్, మంకెన మణిబాబు, సామ్యూల్ జాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే సుపరిపాలన

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: ప్రజల వద్దకు సుపరిపాలన అందజేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో నాలుగోరోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వాటిని పొందుతున్న లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గత పాలకులు చేయని ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ పట్ల ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే పట్టం కట్టేందుకు సద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మాజీ సర్పంచ్ రావి శ్రీధర్, మండల, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన


మేదరమెట్లలో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

చినగంజాం: పంట కోత ప్రయోగంపై వ్యవసాయ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖాధికారి కే భాస్కరరావు అన్నారు. గురువారం ఏవో కార్యాలయంలో పంటకోత ప్రయోగంపై వీఏఏలు, ఎంపీఈఓలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ గణాంకాల అధికారి సీహెచ్ శివప్రసాద్ పంటకోత ప్రయోగంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఏవో కార్యాలయంలో వీఏఏలు, ఉద్యాన విస్తరణాధికారులకు గురువారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అనూష మాట్లాడుతూ పంట ఎంపిక, పొలం ఎంపిక విషయాలను ఏవిధంగా గమనించి ఎంపిక చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి దీప్తి, గ్రామ స్థాయి వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధితో వాకింగ్ ట్రాక్

- రూ.98 లక్షలతో అభివృద్ధి


శంకుస్థాపన చేస్తున్న చైతన్య

అద్దంకి: ఊరచెరువు అభివృద్ధితో నీటి లభ్యత పెరుగుతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. అమృత్ పథకంలో భాగంగా పట్టణంలోని 20వ వార్డులో ఉన్న ఊర చెరువు అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఊర చెరువును అభివృద్ధి చేసేందుకు రూ.98 లక్షలు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులతో చెరువు కట్టలు వేయడం, కట్టలపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం, గ్రీనరీ, పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, వార్డు ఇన్‌చార్జిలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

పలు వార్డులకు నామినేషన్ల దాఖలు

రెండు వార్డులకు 16 నామినేషన్‌లు

వేటపాలెం: మండల పరిదిలోని రామన్నపేట పంచాయతీలో 6, 10 రెండు వార్డులకు జరుగుతున్న ఉప ఎన్నికలకు ఆఖరి రోజు గురువారం 16 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. 6వ వార్డులకు ఆరు మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా 10 వార్డులకు పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ పరిశీలన చేయనున్నట్లు ఆర్ఓ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

శంఖవరప్పాడు 8వ వార్డుకు రెండు నామినేషన్లు

అద్దంకి రూరల్: మండలంలోని శంఖవరప్పాడు గ్రామ పంచాయతీ 8వ వార్డులో దుగ్గ పరమేశ్వర రెడ్డి రాజీనామ చేయటంతో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్‌కు గురువారం చివరి రోజు బాపిరెడ్డి రాఘవరెడ్డి, బత్తుల శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్‌లు వేశారు. రిటర్నింగ్ అధికారిగా ఎంఈవో 1 గంగాధర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావులు ఉన్నారు. 14వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ, 19 తేదీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు

వార్డు నామినేషన్లలో ఘర్షణ

వేటపాలెం: పంచాయతీ వార్డు నామినేషన్‌లు వేసే సమయంలో చోటుచేసుకున్న వివాదం ఘర్షణలకు దారి తీసింది. మండలం పరిధిలోని రామన్నపేట పంచాయతీలో 6, 10 వార్డులకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో భాగంగా నామినేషన్‌ల దాఖలకు గురువారం ఆఖరి రోజు కావడంతో వివిధ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు రెండు వార్డులకు నామినేషన్‌లు దాఖలు చేశారు. జెడ్పీటీసీ భర్త బండ్ల వెంకటేశ్వర్లు (బాబు) తన అనుచరుడిని తీసుకొచ్చి నామినేషన్ వేయడానికి ప్రయత్నించారు. అసమయంలో అక్కడ ఉన్న కొందరు దానిని అడ్డుకోవడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది.వెంటనే పోలీసులు కలుగ జేసుకొని ఇరువర్గాలను అక్కడ నుంచి పంపించి వేశారు. మళ్లీ సాయంత్రం మళ్లీ వారు ఘర్షణ పడ్డారు. పోలీసులు వచ్చి అదుపుచేసే సమయంలో మహిళా కానిస్టేబుల్‌కు రాయి తగిలి గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మహేష్, డీఎస్పీ ప్రసాద్, ఆధ్వర్యంలో భారీగా పోలీస్‌లను మోహరించి ఘర్షణ పడుతున్న వారిని చెదరగొట్టారు.